## క్లుప్తంగా

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



బండివీధిలో అక్షరభ్యాసం నిర్వహిస్తున్న పీడీ శాంతిశ్రీ

**నరసన్నపేట:** అంగన్‌వాడీ కేంద్రాలను బాధ్యతగా నిర్వహించాలని, సమయపాలన విధిగా పాటించాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కేంద్రాల్లో అన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గురువారం స్థానిక బండివీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారనేది పరిశీలించారు. కేంద్రంలో ఇద్దరు పిల్లలకు మూడేళ్లు నిండగా వారికి అక్షరభ్యాసం నిర్వహించారు. మిగిలిన పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడి కేంద్రం పనితీరును అడిగి తెలుసుకున్నారు. నోడల్ ఆఫీసర్ మణిమ్మ, నరసన్నపేట పీఓ శోభారాణి, సూపర్‌వైజర్ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ



అలేజ

**పాతపట్నం:** పాతపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఇన్‌చార్జి (ఎఫ్ఏసీ) కార్యదర్శిగా కె.అలేజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి ఎ.రాజామోహన్‌రావు ఇచ్ఛాపురం ఏఎంసీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. కార్యదర్శి అలేజను సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

### ఐసీడీఎస్ సీడీపీఓగా ఇందిర



సీడీపీఓగా ఇందిర

**పాతపట్నం:** పాతపట్నం ఐసీడీఎస్ సీడీపీఓగా చింతాడ ఇందిర నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం శివశంకర్ కాలనీ కూడలి సమీపంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ సీడీపీఓగా విధులు నిర్వహించిన టి.విమలారాణి డిప్యుటేషన్ రద్దు కావడంతో తిరిగి కడప వెళ్లిపోయారు.

### పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ పవన్

**నరసన్నపేట:** ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు పోటీ పరీక్షల మెటీరియల్‌ను వినియోగించుకోవాలని నరసన్నపేట కళాశాల ప్రిన్సిపల్ ఎం.పవన్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం సైన్స్ విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఎంతగానో ఉపకరించే జేఈఈ, నీట్, ఏపీ ఈఏపీసెట్‌లకు సంబంధించిన పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిందన్నారు. బయోలజీ, భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, గణిత శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన మెటీరియల్‌ను విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలన్నారు. అధ్యాపకులు జె.వేదనగిరి, శివరాంప్రసాద్, వేణుగోపాలరావు, మల్లేష్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**సారవకోట:** మండలంలోని వడ్డినవలస సమీపంలో మే 31వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజాన వెంకటరావు (24) గురువారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన సోదరుడు రాజాన శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేశారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పాతపట్నం:** ఈ నెల 13వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ జి.ప్రసాదరావు గురువారం తెలిపారు. పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ కొత్త లైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దశరథపురం, బైరాగిపేట, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం, పాతపట్నం పరిధిలోని ఫారెస్ట్, సరాలి రోడ్, బీఎస్ఎఫ్ కాలనీ ప్రాంతాలతోపాటు, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

**పొందూరు మండలంలో..**

**పొందూరు:** ఈ నెల 13వ తేదీన పొందూరు, లోలుగు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ ప్రధాన లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించటం, మరమ్మతులు చేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్ ఏఈ పైడి యోగీశ్వరరావు గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పొందూరు, లోలుగు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

# కార్తెలు ఆగమనం.. ఖరీఫ్‌కు శ్రీకారం



బరటాం ప్రాంతంలో నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు

- పలకరించిన తొలకరి వానలు
- సిద్ధం చేస్తున్న నారు మడులు
- ముమ్మరంగా ఖరీఫ్ వెదజల్లే పనులు
- గట్లు బాగు చేస్తున్న రైతన్నలు



జంబాడ ప్రాంతంలో పొలం గట్లను బాగుచేస్తున్న రైతులు

**ఎల్.ఎన్.పేట:** కార్తెలు ప్రవేశించటంతో రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. విత్తనాలు వేసుకునేందుకు మృగశిర, ఆరుద్ర కార్తెలు అనుకూలమైనవిగా రైతులు భావిస్తారు. ఈ నెల 8వ తేదీన మృగశిర కార్తె ప్రవేశించి ఐదు రోజులు అవుతుంది. ఈ నెల 22వ తేదీన ఆరుద్ర కార్తే ప్రవేశించనుంది. రైతులు పొలం పనులు ముమ్మరం చేశారు. ఈ రెండు కార్తెల్లో విత్తనాలు వేసుకుంటే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. మరో వైపు రుతుపవనాలు ప్రవేశించటం, తొలకరి వర్షాలు కురుస్తుండటంతో పదునులు కలిసి వస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆరుద్ర కార్తెలో నారు మడుల్లో విత్తనాలు వేస్తామని అంటున్నారు. మృగశిర కార్తె రావటంతో అనేక గ్రామాల్లో 50 శాతానికి పైగా వరి వెదలు వేసుకున్నారు. మరోవైపు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 75 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. పలుచోట్ల రైతులకు ఇప్పటివరకు విత్తనాల పంపిణీ కాలేదు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. వరి పంటకు సంబంధించి ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

| పాతపట్నం నియోజకవర్గంలో ఖరీఫ్ సాగుభూమి(ఎకరాల్లో) వివరాలు ఇలా.. | | | | | |
|---|---|---|---|---|---|
| మండలం | ఎల్.ఎన్.పేట | మెళియాపుట్టి | పాతపట్నం | కొత్తూరు | హిరమండలం |
| రెవెన్యూ గ్రామాలు | 47 | 70 | 49 | 27 | 40 |
| సాగుభూమి | 10,850 | 22,500 | 18,500 | 20,900 | 6,650 |
| రైతులు | 5,560 | 6,285 | 8,895 | 5,280 | 4,200 |



సుమంతాపురం వద్ద వరి విత్తనాలు చల్లుతున్న రైతు

### విత్తనాలు జల్లుతున్నాం

ఇప్పటికే మృగశిర కార్తె వెళ్లిపోయింది. ఆరుద్ర కార్తె వచ్చి వారం రోజులు అవుతుంది. వరి వెదలు వేసుకోవటం పూర్తయింది. నారు మడులు సిద్ధం చేస్తున్నాం. ఈ ఏడాది వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. మృగశిర, ఆరుద్ర కార్తెల్లో విత్తనాలు వేసుకుంటే పంటలు బాగా పండుతాయని నమ్మకం.

– పాలక మల్లేశ్వరావు, రైతు, జంబాడ, ఎల్.ఎన్.పేట

## ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

**నరసన్నపేట:** స్థానిక రాజీవ్‌నగర్–పురుషోత్తం నగర్ కాలనీ వద్ద సీతారాముల కల్యాణం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు.

వనమాళి బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీటీసీ డేవిడ్, ఆలయ కమిటీ ప్రతినిధి పతివాడ గిరీశ్వరరావు, రెండు కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభించిన సర్పంచ్, డేవిడ్, తదితరులు

### కల్యాణం.. కమనీయం

**కొత్తూరు:** మండల కేంద్రంలోని సీతారామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు నిర్వహించారు. మధ్యాహ్న అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొత్తూరులోని హరిదాసు కొనేరులో రాత్రి స్వామివారికి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. కొనేరును విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎల్.తాతబాబు, తులసీవరప్రసాదరావు, పాగిరి రవి, యతిరాజు, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కనుల విందుగా సాగిన తెప్పోత్సవం

### వరి విత్తనాల పంపిణీ

**నరసన్నపేట:** మండలంలోని రావులసవలస రైతు సేవా కేంద్రంలో గురువారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సచివాలయానికి 132 బస్తాల వరి విత్తనాలు వచ్చాయని వీఏఏ హారిక తెలిపారు. 1061, 1064, 1121 రకాల విత్తనాలు వచ్చాయని, రైతులు వినియోగించుకోవాలన్నారు.

సాంబ రకం అయితే బస్తా రూ.825, మిగిలిన రకాలైతే బస్తా రూ.960లని అన్నారు. సర్పంచ్ పి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శాంతి

### పరామర్శ..

**సరుబుజ్జిలి:** మండలంలోని సింధువాడ గ్రామానికి చెందిన మీసాల అప్పలనాయుడు భార్య ఇటీవల కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు.

పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నేతలు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల శ్యామలరావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, మూడడ్ల రమణ, యడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరినాయుడు, ఇల్లాకుల సూర్యప్రకాశరావు, శ్రీను, రామకృష్ణ, తిరుపతిరావు పాల్గొన్నారు.



అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

### ఉపాధి సామాజిక తనిఖీపై అవగాహన



లాభాంలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, సిబ్బంది

**బూర్జ:** మండలంలోని లాభాం, అల్లెన గ్రామాల్లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సర్పంచ్‌లు పప్పల కృష్ణారావు, జద్దు మహేష్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ర్యాలీలు చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల వివరాలు వెల్లడించారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని ఉపాధి హామీ అధికారులు వెల్లడించారు. ఎస్ఆర్పీలు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**పాతపట్నం:** స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పాతపట్నం మండలంలో రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సి.హెచ్.ఇందిర గురువారం తెలిపారు. చాకిపల్లి–1 అంగన్‌వాడీ ఆయా పోస్టు ఎస్సీ, పెద్దమల్లిపురం అంగన్‌వాడీ ఆయా పోస్టు ఓసీ కేటగిరి కలిగి ఉండాలన్నారు. ఏడో తరగతి పాసై, అభ్యర్థులు స్థానికులై, వయస్సు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలని, వివాహిత మహిళలు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పాతపట్నం శివశంకర్ కాలనీలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

**రెండు ఆయా పోస్టులకు నోటిఫికేషన్**

**సారవకోట:** స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని జలుమూరు మండలానికి సంబంధించి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ హెచ్.కె.కామాక్షి గురువారం తెలిపారు. కొమనాపల్లి–1 ఆయా బీసీ–డి, కరకవలస కాలనీ ఆయా బీసీ–బికి కేటాయించినట్లు చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 20వ తేదీ లోగా సారవకోట ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

**రెండు ఆయా పోస్టులకు నోటిఫికేషన్..**

**బూర్జ:** స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ ఎస్.గీత గురువారం తెలియజేశారు. మండలంలోని మామిడివలస ఆయా ఎస్సీ, అన్నంపేట ఆయా ఓసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థి స్థానికంగా నివాసం కలిగి, వివాహిత మహిళలై ఉండాలని, 21 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండాన్నారు. ఏడో తరగతి విద్యార్హత ఉండాలన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా బూర్జ ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తు అందజేయాలన్నారు.

# మోసం కూటమి నైజం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**ఎల్.ఎన్.పేట:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు కూటమి పార్టీల నాయకులు విద్యార్థులను, యువతకు ఉపాధి అవకాలు కల్పించకుండా మోసం చేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏడాది పాలనలో సంబరాలు చేసుకుంటున్న కూటమి పార్టీ నాయకులు ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఎందుకు చెల్లించటం లేదని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుకునే పేద, మధ్య తరగతి, సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి కాలేజీలకు ఫీజులు చెల్లిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడం లేదన్నారు. వసతి దీవెన కూడా ఏడాదిగా చెల్లించకపోవడంతో విద్యార్థుల భోజన ఖర్చులు కూడా వారే అప్పులు చేసి కట్టుకుంటున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో అప్పులు చేసి ఫీజులు కట్టలేని వేలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్లను ఆయా కాలేజీల యాజమాన్యాలు వారికి ఇవ్వటం లేదన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి విద్యార్థులను, యువతను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఆరోపించారు. ఆయా వర్గాల వారికి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే వారితో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## మురుగునీరు తొలగింపు

**సారవకోట:** మండలంలోని కిడిమి పంచాయతీ భద్రాచలంలోని తాగునీటి వనరుల చుట్టూ ఉన్న మురుగు నీటిని సచివాలయ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ గ్రామంలో ఉన్న తాగు నీటి బావి, కుళాయి చుట్టూ మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. దీనిపై ఈ నెల 10న సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ మోహన్‌కుమార్ స్పందించారు. మురుగునీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో మురుగునీరు తొలగించారు.



నీటి వనరులను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

## చెట్టు కొమ్మ తొలగింపు

**జలుమూరు:** మండలంలోని సువరం పంచాయతీ పరిసది దొంపాక గ్రామం ఎల్‌కే రోడ్డుకు ఆనుకొని ఉన్న మర్రి చెట్టు కొమ్మ వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడంతో ఈ నెల 11న సాక్షిలో వార్త ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు గురువారం స్పందించారు. ప్రమాకదరంగా వేలాడి ఉన్న చెట్టు కొమ్మను తొలగించారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.



చెట్టుకొమ్మను తొలగించిన అనంతర దృశ్యం

## సామూహిక అక్షరాభ్యాసాలు




హిరమండలం: సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**హిరమండలం:** మేజర్ పంచాయతీ హిరమండలంలో ఉన్న ఏడు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నూతనంగా చేరిన చిన్నారులకు పెద్దకోరాడలో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో సామూహిక అక్షరభాసాలు గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూరు మండలంలో..**

**కొత్తూరు:** కొత్తూరుతోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారులను గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు ఆయా కేంద్రాల కార్యకర్తలు నిర్వహించారు. పాఠశాలలు ప్రారంభం రోజు కావడంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## విద్యార్థి మిత్ర కిట్లు అందజేత



హిరమండలం: విద్యార్థి మిత్ర కిట్లను అందజేస్తున్న ఎంఈఓ రాంబాబు

**హిరమండలం:** ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య పెంచాలని ఎంఈఓ రాంబాబు సూచించారు. గురువారం విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసించిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్న బియ్యంతో ఆహారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోరాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



సారవకోట: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓలు

**పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ**

**సారవకోట:** మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి గురువారం పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. హెచ్‌ఎం తంప రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిక్కు.. బిక్కుమంటూ..!

- శిథిలావస్థలో నరసన్నపేట పోలీసు స్టేషన్
- పెచ్చులూడుతున్న స్లాబ్
- ఆందోళనలో సిబ్బంది
- 1992లో భవనం ప్రారంభం

**నరసన్నపేట:** మండల కేంద్రం నరసన్నపేటలో 33 ఏళ్ల క్రితం నిర్మించిన పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పటికప్పుడు స్లాబ్ పెచ్చులూడుతుండటంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని పోలీస్ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల స్లాబ్ రెండు చోట్ల పెచ్చులూడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మళ్లీ ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయో అని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. రైటర్ విధులు నిర్వహించే గదిలో పెచ్చులు ఊడాయి. సీలింగ్ అంతా ఒక్కసారి కింద పడిపోయింది. ఫ్యాను కూడా పడిపోయింది. మిగిలిన భాగం కూడా ప్రమాదకరంగా ఉందిన సమాచారం. వర్షం పడితే నీరు లోపలికి, స్లాబ్ నుంచి కారుతుంది. ప్రస్తుతం వర్షాకాలం రావడంతో ప్రమాదం పొంచి ఉందని సిబ్బంది అంటున్నారు. నాలుగేళ్ల క్రితం నరసన్నపేట పోలీస్ క్వార్టర్స్‌లో ప్రమాదం జరిగింది. ఈ క్వార్టర్స్‌లో నివసిస్తున్న కానిస్టేబుల్‌పై కిటికీ స్లేడ్ పడి తీవ్రంగా గాయపడటం తెలిసిందే. నెల క్రితం నూతన పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, స్థల పరిశీలన చేయడం జరిగిందని పోలీసులు అంటున్నారు. అయితే పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి ప్రమాదం జరగకముందే కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.



శిథిల భవనంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు



స్లాబ్‌కు కనిపిస్తున్న గజాలు